క్లుప్తంగా

నిధులు మంజూరు కాగానే జీతాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కోచ్‌లకు నిధులు మంజూరు కాగానే వేతనాలు అందజేస్తామని చీఫ్ కోచ్ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ క్రీడామైదానంలో 14 మంది, అమలాపురం డీఎస్ఏలో ముగ్గురు కోచ్‌లకు నెలకు రూ2,13,500 రూపాయలు చెల్లించాల్సి ఉంది. డీఎస్ఏ ఉన్నతాధికారాలు చొరవ తీసుకుని జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోచ్‌లు కోరుతున్నారు.

క్రీడలతో ఆరోగ్యం



నాగలక్ష్మికి ఆర్థిక సహాయం చేస్తున్న ట్రస్టు సభ్యులు

కాకినాడ రూరల్: ఆరోగ్యానికి, దృఢత్వానికి అథ్లెటిక్స్ ఎంతగానో ఉపయోగపడతాయని షటిల్ క్రీడాకారుడు, ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. ఆదివారం ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ వేడుకలు నిర్వహించారు. ఇటీవల శిరిడీలో జరిగిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో రజత పతకాన్ని సాధించిన దంగేటి వర్ధిని నాగమహాలక్ష్మిని ట్రస్టు ఆధ్వర్యంలో సత్కరించి, కొంత మొత్తాన్ని ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, రాజా, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు శంకుస్థాపనలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని పలు ఆలయాల నిర్మాణాలకు ఆదివారం నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కురసాల సత్యనారాయణ శంకుస్థాపనలు చేశారు. పగడాలపేటలో బులివెంకమ్మ ఆలయం, తూరంగి రవీంద్రనగర్‌లో రామాలయంలో రాధాకృష్ణ ఆలయం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం తురంగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణమ్మ ఆలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, తురంగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, దాట్ల సత్యనారాయణరాజు, గరికిన అప్పన, పంపన రామకృష్ణ, జగడం అప్పారావు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మొక్కలను నాటుతున్న జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

కాకినాడ సిటీ: కాకినాడ ఆర్టీసీ బస్టాండ్‌ను ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ఆదివారం పరిశీలించారు. ఆమె బస్టాండ్, గ్యారేజ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాకినాడ డిపో ఉద్యోగులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, ఇంజినీర్ కె.ప్రభాకరరావు, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న బలరామకృష్ణ

సామర్లకోట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కాకినాడ బాలవేదిక కన్వీనర్, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు నోరి బలరామకృష్ణ విద్యార్థులను చెణుకులు, చమత్కార సంభాషణలతో ఆనంద డోలికల్లో తేలించారు. మాధవపటం శివారు జమునానగర్ కాలనీలో బాలమందిరం, జిల్లా విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన పాల్గొని అనేక విషయాలను వివరించారు. విద్యార్థి నెంబరు వన్ కావడం ఎలా అనే అంశంపై ఆసక్తికరమైన విలువైన సూచనలిచ్చారు. భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూస్ రీడింగ్, యాంకరింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి బాలమందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ వేసవి వినోద కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాణ సంకటం.. పొరుగువారికేగా..

- పందులు, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా కాకినాడలోని ఖాళీ స్థలాలు
- నిరుపయోగ స్థలాలతో పక్కవారికి అవస్థ
- గడచిన మూడేళ్లకే వీఎల్‌టీ వసూలు చేయడంతో లెక్కచేయని యజమానులు
- ప్రక్షాళనకు నడుం బిగించిన నగరపాలక సంస్థ యంత్రాంగం



ఖాళీస్థలాల్లో ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

కాకినాడ: కొంతమంది భూ యజమానుల స్వార్థమో, నిర్లక్ష్యమో ఇరుగింటి, పొరుగింటి వారికి శాపంగా మారుతోంది. స్థలాలు కొనడం తరువాత అమ్ముకోవచ్చనో, లేదా డబ్బులేక తరువాత ఇల్లు కట్టుకోవచ్చనో దీర్ఘకాలం పాటు ఆ స్థలాన్ని ఖాళీగా వదిలేస్తుంటారు. ఆనక ఎవరైనా కబ్జా చేస్తే లబోదిబోమంటారు. ఇంతలో పక్క స్థలం యజమాని ఇల్లు కట్టుకోవడం, ఈ ఖాళీ స్థలంలో చెత్త, వర్షపునీరు నిలచిపోవడం, దుర్గంధం వ్యాపించడం, దోమల ఉధృతి తదితర కారణాలతో ఆ ఇంటివారు నరకయాతన అనుభవిస్తుంటారు. ఈ పరిస్థితి నివారించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. సదరు ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మించాలంటే గడచిన మూడేళ్ల ఖాళీ స్థలం పన్ను చెల్లిస్తే సరిపోతుందన్నది నిబంధన. కానీ కొన్నేళ్ల తరబడి ఆ ఖాళీ స్థలంతో ఇరుగు పొరుగులు పడే నరకయాతన అంతా యింతా కాదు.

4401 స్థలాలు గుర్తింపు:

ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన డాక్టర్ మహేష్‌కుమార్ ఈ తరహా ఇబ్బందులపై దృష్టిపెట్టి నగర పరిధిలోని పలు కాలనీల అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రక్షాళన చేయనున్నారు. నగరం మొత్తం మీద ఇటువంటివి 4,401 ఖాళీ స్థలాలు ఉన్నట్టుగా తేల్చారు. ఇందులో 1478 స్థలాలకు కాంపౌండ్ వాల్స్ ఉన్నట్టు గుర్తించారు. మరో 228 స్థలాలకు ఫెన్సింగ్ వేశారు. 143 స్థలాలను వెంటనే పరిశుభ్రం చేయాల్సిన అవసరం ఉన్నట్టుగా గుర్తించారు. 894 స్థలాల్లో మురుగునీరు లేదా వర్షపునీరు స్తంభించినట్టు నిర్ధారణకు వచ్చారు. దాదాపు 1382 స్థలాలకు సంబంధించి యజమానులు ఎవరో తెలియడం లేదని తేల్చారు. కాగా ఎన్నిసార్లు హెచ్చరించినా స్పందించని 1058 మంది యజమానుల స్థలాల్లో నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. 1904 మందికి నోటీసులు కూడా ఇచ్చారు.

చురుగ్గా ప్రత్యేక పారిశుధ్య చర్యలు

ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త సమస్య నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు కమిషనర్ మహేష్ కుమార్, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఆదివారం చర్యలు చేపట్టారు.

కఠిన చర్యలు తీసుకుంటాం:



స్థల యజమానులు వెంటనే పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని 1955 సెక్షన్ 483, 485, 487, 488, 496, 497, 596 (ఎ) (బి) ప్రకారం చర్యలు తీసుకుంటాం. పొరుగు ప్రాంతాల్లో నివసించే ప్రజలు కూడా ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత యజమానులపై ఉంది.

– డాక్టర్ ఆర్.మహేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్

పరిశుభ్రత అందరి బాధ్యత



శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కమిషనర్ మహేష్‌కుమార్

- ఎమ్మెల్యే కురసాల, కమిషనర్ రావిరాల
- ఖాళీ స్థలాలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

కాకినాడ రూరల్: కార్పొరేషన్‌లో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని విద్యానగర్ ప్రాంతంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ రావిరాలా మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. తొలుత స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యానగర్ పరిసర ప్రాంతాలలో ఎంపిక చేసిన ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించారు. ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు స్వయంగా చెత్తను తొలగించగా ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లు, బ్లేడ్ ట్రాక్టర్లను వినియోగించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ పరిశుభ్రతకు మారుపేరుగా నిలుస్తుందన్నారు. బెస్ట్ లివింగ్ సిటీలలో ఒకటైన విద్యానగరంలో ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కొందరు స్థల యజమానులు వైఖరి వల్ల అనారోగ్య పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. కమిషనర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ 36 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన ఉన్న నగరంలో సుమారు 4 వేల ఖాళీ స్థలాలు గుర్తించామని, వాటిలో నీరు స్తంభించి చెత్త, చెదారాలతో పందులకు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నందున సదరు యజమానులకు నోటీసులు ఇచ్చామని, వారు స్పందించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ వంటి సేవా సంస్థలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. వారితో పాటు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, ఎలక్ట్రికల్ ఏఈ ఆదినారాయణ, కార్పొరేషన్ ఏఈ రమేష్, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పదింతలు విరిసిన పల్లె కుసుమాలు



అత్యధిక మార్కులు సాధించిన ప్రియరత్న గాయత్రిని అభినందిస్తున్న దృశ్యం



అక్షయ డిసోజ (576)



అమృత వర్షిణి (574)



వై.రామదీపిక తులసి (569), అరట్లకట్ట హైస్కూలు

- మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పదో తరగతి విద్యార్థులు
- భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్న వైనం



తల్లి సింహాచలంతో కుమార్తెలు జ్యోత్స్న, సాద్విక



ఆర్.సాయికుమార్ (565) గురుకుల పాఠశాల, కరప



టి.షర్మిళ సత్య (564) కరప హైస్కూలు

కాకినాడ రూరల్ / కరప: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో గ్రామీణ విద్యార్థులు మంచి మార్కులు సాధించి నియోజకవర్గానికి మంచి పేరు తెచ్చారు. భావి జీవితానికి బాటలు వేసుకునేలా మంచి మార్కులతో ఉత్తీర్ణులై తరువాతి తరాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. మధ్య, దిగువ తరగతి విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల బిడ్డలు చాలా మంది చెప్పుకోదగ్గ స్థాయిలో మార్కులు సాధించారు.

కాకినాడ రూరల్ మండల పరిధిలో తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శేరు ప్రియరత్న గాయత్రి 580 మార్కులు సాధించింది. పి.వెంకటాపురం గురుకుల పాఠశాల విద్యార్థినులు సరుగోలు అక్షయ డిసోజ 576 మార్కులు సాధించగా, పిట్టా అమృత వర్షిణి 574 మార్కులు సాధించింది.

గురుకుల పాఠశాల విద్యార్థినులు 91 శాతం ఉత్తీర్ణత సాధించి టాప్‌లో నిలిచారు. పి.వెంకటాపురంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి దడాల జ్యోత్స్న 589 మార్కులతో రాష్ట్ర స్థాయిలో గురుకుల పాఠశాలల్లో ప్రథమంగా నిలిచింది. పండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గొల్లప్రోలు లక్ష్మీదుర్గ 582 మార్కులతో మండలస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. కరప మండల పరిధిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ వసతి గృహం విద్యార్థు మంచి ఉత్తీర్ణత సాధించారు. అరట్లకట్ట హైస్కూలు విద్యార్థి వై.రామదీపిక తులసి 569 సాధించగా, మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వసతి గృహం విద్యార్థి ఆర్.సాయికుమార్ 565 మార్కులతో స్కూలు ఫస్ట్ వచ్చాడు.

కరప హైస్కూలులో టి.షర్మిల సత్య 564, బి.మానస సాయి 554, జి.జయసత్యశ్రీ పద్మలక్ష్మి 546, బి.గనికశ్రీహరిశిత 546 మార్కులతో స్కూల్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. గొర్రిపూడిలో ఏఎస్ఎస్ హర్షిణి 539, జేబీ సుష్మశ్రీ 520 మార్కులు సాధించారు. వేములవాడలో పీఎల్ఎస్‌సీహెచ్ఏఎస్ శారదాంబ 553 మార్కులు సాధించింది. వేళంగిలో జి.వైష్ణవి 561, సీహెచ్ఎల్ఎస్ శృతి 557, ఎన్.రూపశ్రీసత్య 556 మార్కులతో మొదటి మూడు స్థానాలలో నిలిచారు.

పెద్దాపురప్పాడులో పి.దుర్గాభవాని 554, ఓ.రమ్యశ్రీ 533, ఎం.వెంకటశుభాస్ 521 మార్కులు సాధించారు. గురజనాపల్లిలో పి.భువనేశ్వరి 542, జి.సూర్యప్రకాష్ 538, ఎ.వెంకటేశ్వరరావు 525 మార్కులు సాధించారు.

ఎమ్మెల్యే కన్నబాబుతోనే నా పయనం



జగడం శ్రీహరి, వైఎస్సార్ సీపీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు

కాకినాడ సిటీ: జెండా, అజెండా లేని జనసేన పార్టీ నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ తాను ఆ పార్టీలోకి వెళ్తున్నట్లు ప్రచారం చేయడాన్ని తూరంగి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు జగడం శ్రీహరి ఖండించారు. ఆదివారం తూరంగి డ్రైవర్స్‌కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 12 ఏళ్లుగా తాను వైఎస్సార్ సీపీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకునేందుకు న్యాయ సలహాలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. తన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే కన్నబాబు తనకు గ్రామ కమిటీ అధ్యక్ష బాధ్యతలతో పాటు ఏఎంసీ ఉపాధ్యక్ష పదవిని ఇచ్చారన్నారు.

విజ్ఞానదాయకంగా పీజీ అప్‌డేట్

- అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో జోనల్ సీఎంఈ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అతిథులు

కాకినాడ క్రైం: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో జోనల్ సీఎంఈ–3ని కాకినాడ ఆర్ఎంసీ అనస్థీషియా విభాగం ఆదివారం నిర్వహించింది. జీజీహెచ్‌లోని సర్జరీ ఎగ్జామినేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ సీఎంఈకి పీజీ అప్‌డేట్‌గా నామకరణం చేశారు. మత్తు వైద్య విద్యను అభ్యసిస్తున్న పీజీ విద్యార్థుల విజ్ఞాన ఉన్నతే లక్ష్యంగా అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన ఈ సీఎంఈని రూపకల్పన చేసి నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరుకాగా, విశిష్ట అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి హాజరయ్యారు. 9 మంది వక్తలు కీలక అంశాలను చర్చించారు. డాక్టర్ ఏవీ రావు జోనల్ కో ఆర్డినేటర్‌గా, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు సీఎంఈ పర్యవేక్షకుడిగా వ్యవహరించిన కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేవీ మాధవి, డాక్టర్ ప్రసన్నకుమార్, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

అల్లూరి చిరస్మరణీయుడు



సభలో పాల్గొన్న కర్రి భామిరెడ్డి, అచ్యుత రామారెడ్డి, పంపన దయానందబాబు



అల్లూరి కాంస్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న స్మారక వేదిక, పరిషత్ సభ్యులు

కాకినాడ కల్చరల్: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మణీయుడని సీతారామరాజు స్మారక కళావేదిక గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశ భవనంలో సీతారామరాజు స్మారక కళావేదిక, క్షత్రియ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వేదిక అధ్యక్షులు కర్రి అచ్యుత రామారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎందరో త్యాగమూర్తుల త్యాగాలకు ఫలితంగా మనకు స్వాతంత్ర్య వచ్చిందని వేదిక కార్యదర్శి పంపన దయానందబాబు అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంస్థ గాయకులు ఆలపించి దేశభక్తి గీతాలు అలరించాయి. పలువురు వక్తలు స్మారక కళావేదిక, క్షత్రియ పరిషత్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముందు ఉదయం స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని అల్లూరి కాంస్య విగ్రహానికి పరిషత్, స్మారక కళావేదిక సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు వేగేశ్న వెంకటవిశ్వనాథవర్మ, యువరాజు అద్దేపల్లి ప్రభు, జానకిరామ్ చౌదరి, మురళి తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచీ ఆధ్యాత్మికత అలవరచుకోవాలి



పిల్లలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: విద్యార్థులు చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక తత్వ జ్ఞానాన్ని నేర్చుకుంటే జీవితం ఆనందమయంగా సాగుతుందని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. స్థానిక పీఠం నూతన ఆశ్రమం ఆవరణలో శనివారం తాత్విక బాల వికాష్ వేసవి శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నారులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని భౌతిక జీవితాన్ని చక్కగా నిర్వర్తించాలని సూచించారు. పీఠం తాత్విక బాల వికాష్ వేసిన పునాదిని మరచిపోకుండా అందరినీ జ్ఞాన మార్గంలో నడిచేలా ప్రోత్సహించాలన్నారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రణవాశ్రమానికి చెందిన ప్రభావతి మాతాజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌లో తేనెపట్టు



రైల్వేస్టేషన్‌లో పట్టిన తేనెపట్టు

అన్నవరం: వేలాది మంది ప్రయాణికులు, భక్తులు ప్రతినిత్యం ప్రయాణించే అన్నవరం రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాం లిఫ్ట్ వద్ద తేనెపట్టు పట్టింది. అక్కడ తేనెటీగలను చూసి ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫాంలు కలిసే ఉంటాయి. మూడో నంబర్ ప్లాట్‌ఫాం మీద విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్లు ఆగుతాయి. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు సుమారు 20 రైళ్లకు ఇక్కడ హాల్ట్ ఉంది. ఆ రైళ్లలో దిగిన ప్రయాణికులు రెండో నంబర్ ప్లాట్‌ఫాం మీద గల లిఫ్ట్ ద్వారా ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా వెలుపలకు వచ్చి అక్కడ నుంచి అన్నవరం దేవస్థానానికి వెళ్లే వాహనాల స్టాండ్‌కు వస్తారు. వీరిపై తేనెటీగలు దాడిచేసే అవకాశం ఉండడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అన్నవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌త్రినాథ్‌రెడ్డిని వివరణ కోరగా సమస్యను సామర్లకోట రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

అమృతఫలం.. ఎంతో ప్రియం!

- దిగుబడి తగ్గి ధర పెరుగుదల
- అంతంత మాత్రంగా విక్రయాలు
- వర్షాలతో పండ్లకు పురుగుల బెడద



సామర్లకోట మరం సెంటర్‌లో వెలవెలబోతున్న మామిడి పండ్ల దుకాణాలు

సామర్లకోట: వేసవి వస్తోందంటే అందరి మనసూ మామిడి పండ్లవైపే లాగేస్తుంది. అమృతఫలమనే పేరు ఎలా వచ్చిందో తెలియదు కానీ నిజంగా ఒక్క చుక్క మామిడి రసం నాలుకపై పడినా ప్రాణం లేచొస్తుందంటే అతిశయోక్తి కాదు. మామిడి పండ్లను బహుమానంగా పంపి పాకిస్తాన్‌తో మైత్రీబంధాన్ని కోరుకుంటున్నట్టు సాక్షాత్తు దేశ ప్రధాని ఆ దేశ ప్రధానికి పరోక్ష సందేశం పంపిస్తున్నామంటే ఈ పండు ఎంత ప్రఖ్యాతమైనదో అర్థమవుతుంది. అటువంటి పండు ఈ ఏడాది అంత సులభంగా అందే పరిస్థితి కనిపించడం లేదు. దిగుబడి 50 శాతానికి పడిపోయింది. దీంతో సహజంగానే ధర అమాంతం పెరిగిపోతుంది.

కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండిస్తే ఎక్కడ దొరికిపోతామో, శిక్ష పడుతుందోనని రైతులు ఆందోళన చెంది ఆ ప్రయత్నం విరమించుకుని సంప్రదాయబద్ధంగా గడ్డిలో మగ్గిస్తున్నారు. మార్కెట్‌లో మామిడి విక్రయాలు తగ్గడానికి ఇదికూడా కారణంగా కనిపిస్తోంది. గత ఏడాది డజను పండ్లు రూ.100 నుంచి రూ.150 ఉంటే ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తుండడం గమనార్హం.

పచ్చికాయలు ఎగుమతి...

చెట్ల నుంచి పచ్చి కాయలు కోసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మామిడి కాయలను పెద్ద పెద్ద కంపెనీలు పచ్చళ్ల తయారీకి, శీతల పానీయాల తయారీకి కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడింది.

20 ఏళ్లుగా విక్రయిస్తున్నాను



20 ఏళ్లుగా రైతుల నుంచి మామిడి కాయలు కొని ముగ్గించి 20 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి సామర్లకోటలో విక్రయిస్తున్నా. ఈ ఏడాది విక్రయాలు అంతగా లేవు. రోజంతా విక్రయిస్తే రూ.500 వస్తుంది. కాలానికి తగ్గట్టు పండే పండ్లను విక్రయిస్తుంటాను.

– వీరబాబు, పండ్ల వ్యాపారి, కోటపాడు

గడ్డిలో పండించే వారు తక్కువ



గతంలో మామిడి కాయలను సంప్రదాయబద్ధంగా ముగ్గించేవారు. అవి ఎంతో మంచి సువాసనతో, రుచిగా ఉండేవి. నేడు మామిడి పండ్లలో వాసన కనిపించడం లేదు. గడ్డిలో ముగ్గవేసే వారు కరువయ్యారు.

– తోటకూర గంగాధర్, శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, పీబీ దేవం